క్లుప్తంగా

పెట్టుబడి సాయం వెంటనే అందించాలి

సీతారామపురం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున మెట్ట ప్రాంత రైతులకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందించాలని ఉదయగిరి డివిజన్ రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. శనివారం సీతారామపురం మండలంలో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్ పథకం నుంచి తొలి విడత రూ.2 వేలు రైతుల ఖాతాల్లో జమ అయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయం నగదు ఊసే ఇప్పటి వరకు లేదన్నారు. పాలకులు స్పందించి వెంటనే పెట్టుబడి సాయం అందేలా చూడాలన్నారు. ఆయన వెంట సీపీఎం నాయకుడు కోడే రమణయ్య, రైతులు ఉన్నారు.

శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



ప్రభుత్వాస్పత్రి ఆవరణలో మొక్క నాటుతున్న నాయకులు

అల్లూరు: జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతిని పురస్కరించుకుని శనివారం అల్లూరులో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అమ్మకు ఒక మొక్క పేరుతో అల్లూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు కన్యాపూరి శ్రీనివాసులు, కత్తుల కిరణ్, తాళ్లూరు నవీన్‌కుమార్, కృష్ణసాయి, మల్లికార్జునసింగ్, శంకర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు గౌరవ వేతనం చెల్లించండి సారూ..

ఆత్మకూరు: గత ప్రభుత్వంలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పనిచేసి సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే అందించిన వలంటీర్లను టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ప్రజలు మండిపడుతున్నారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి సేవలు అందించిన ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వలంటీర్లకు ప్రభుత్వం ఇచ్చే కొద్దిపాటి గౌరవ వేతనాన్ని నిలిపివేసింది. మున్సిపల్ పరిధిలోని వలంటీర్లకు గౌరవ వేతనం విడుదల చేయాలని వారు కోరుతున్నారు. రూరల్ పరిధిలో విధుల్లో ఉన్న వలంటీర్లకు పనిచేసినంత కాలం వేతనానికి బిల్లులు పెట్టామని ఎంపీడీఓ బాలాజీ నాయక్ తెలిపారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాను సంప్రదించగా విధుల్లో ఉన్న వలంటీర్లకు గౌరవ వేతనాలు చెల్లించేందుకు బిల్లులు పెట్టామన్నారు.

వెంకయ్యనాయుడిని కలిసిన చవటపాలెం రైతులు



వెంకటాచలం: మండలంలోని చవటపాళేనికి చెందిన రైతులు మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం ఉదయం కలిశారు. చవటపాళెంలో ఎన్‌సీఈఆర్‌టీ సంస్థ ఏర్పాటుకు సేకరించిన భూములకు సంబంధించిన పరిహారం ఇంకా తమకు అందలేదని, పరిహారం అందేలా చూడాలని రైతులు కోరారు. స్పందించిన వెంకయ్యనాయుడు జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడి పరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కొడవలూరు: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని యల్లాయపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కావ్య కోరారు. మండలంలోని నార్సురాజుపాళెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. డాక్టర్ కావ్య రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలపై ఏమైనా సందేహాలుంటే గ్రామానికే వైద్యులు వచ్చినప్పుడు పరీక్ష చేయించుకోవాలన్నారు. ఆరోగ్య పరమైన సమస్యలను ప్రాథమిక దశలో గుర్తిస్తే సులువుగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఆరోగ్య సమస్యలపై ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదన్నారు. శస్త్రచికిత్స అవసరమైనా వైద్యసిబ్బందే చొరవ చూపి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సరోజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణులు మూల్యం చెల్లించుకోక తప్పదు

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



దుత్తలూరు: తిరుపాల్‌నాయుడిని పరామర్శిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు: ప్రజలను ఇబ్బంది పెడుతున్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం దుత్తలూరు మండలంలోని కొత్తపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగోతు తిరుపాల్‌నాయుడు దుకాణం రేకులను టీడీపీ నాయకులు కూల్చిన నేపథ్యంలో ఆయనను మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అధికారం శాశ్వతం కాదని, టీడీపీ నాయకులు ప్రజలను ఇబ్బందులు పెట్టడం మానుకోవాలని హితవు పలికారు. టీడీపీ దుశ్చర్యలకు ఎవరూ భయపడవద్దని, ఎళ్లవేళలా తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, నాయకులు కండ్లగుంట వెంకటరెడ్డి, సింగవరపు గంగాధరం, తిప్పిరిబోయిన వెంగయ్య, కంభం మురళి, కాలిచప్పిడి వెంకటేశ్వర్లు, దేవరపాటి సురేంద్ర, నాగోతు తిరుపాలునాయుడు, రామాంజనేయులు, కొండస్వామినాయుడు, పెద్దిరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కలిగిరి: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కందులవారిపాళెంలో ఇటీవల మృతిచెందిన సర్పంచ్ దాసరి కొండమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు కోట యానాదిరెడ్డి కుటుంబసభ్యులను వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శనివారం పరామర్శించారు. మృతుల ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబసభ్యులను ఓదార్చారు. వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఉప సర్పంచ్ కందుల వెంకటరమణమ్మ నివాసంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పలు అంశాలపై చర్చించారు. తాను ఎళ్లవేళలా అందుబాటులో ఉంటానని, ఎవరికి ఏ కష్టం వచ్చినా అండగా నిలుస్తానని తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, నాయకులు పాలూరు కొండారెడ్డి, మల్లు రియాజ్‌రెడ్డి, కందుల రమణారెడ్డి, మహేష్‌రెడ్డి, అంకిరెడ్డి, మల్లికార్జున్, వెంకటరత్నం, నాగేంద్రరెడ్డి, దశరథరామిరెడ్డి తదితరులు ఉన్నారు.



కలిగిరి: దాసరి కొండమ్మ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ఎంపీటీసీ సభ్యుడికి పరామర్శ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలోని చాకలకొండ ఎంపీటీసీ సభ్యుడు డేగా వంశీ ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శనివారం వింజమూరులోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, నేతలు మద్దూరి బాబు, మలిరెడ్డి విజయరెడ్డి, పల్లాల కొండారెడ్డి తదితరులు ఉన్నారు.



ఉదయగిరి: వంశీని పరామర్శిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

మానవత్వం చాటుకున్న మేకపాటి

మర్రిపాడు: వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ ద్విచక్ర వాహనదారుడిని 108 వాహనంలో తరలించి మానవత్వం చాటుకున్నారు. వివరాలు.. మేకపాటి రాజగోపాల్‌రెడ్డి శనివారం దుత్తలూరు మండలం కొత్తపేట గ్రామానికి వెళ్తున్న క్రమంలో బ్రాహ్మణపల్లి సమీపంలో ఓ ద్విచక్ర వాహనచోదకుడు డివైడర్‌ను ఢీకొని గాయపడ్డారు. దీనిని గమనించిన ఆయన ఆ వ్యక్తిని 108 వాహనం ద్వారా మర్రిపాడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించే వరకు అక్కడే ఉండి పర్యవేక్షించారు.



సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

కలిగిరి: ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి సూచించారు. కలిగిరి పంచాయతీ జిర్రావారిపాళెంలో శనివారం 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. నివాస ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. 104 వాహనంలో అన్నిరకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి గీతారెడ్డి

పాఠశాల తనిఖీ



విద్యార్థినితో పాఠ్యాంశాన్ని చదివిస్తున్న డిప్యూటీ ఈఓ గోపాల్

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ ఈఓ కె.గోపాల్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. పాఠశాలలో వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అన్ని తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించారు. బోధనాంశాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మాలకొండలరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు



సంగం: కుక్కకు రేబిస్ నిరోధక టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి సుజని



వరికుంటపాడు: కుక్కకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి రాఘవేంద్ర శర్మ

మర్రిపాడు: ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం మర్రిపాడులోని పశువైద్యశాలలో ఏడీ గురుజయంతి ఆధ్వర్యంలో శనివారం కుక్కలకు ఉచితంగా రేబిస్ నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీధి కుక్కలు, పెంపుడు కుక్కలకు ఈ టీకాలు వేయించడం ద్వారా రేబిస్ వ్యాధిని నివారించవచ్చని తెలిపారు. అలాగే కుక్క కాటుకు గురైన వారికి ఎలాంటి హాని ఉండదని తెలిపారు.

55 కుక్కలకు టీకాలు

వరికుంటపాడు: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం వరికుంటపాడు మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, వరికుంటపాడు పశు వైద్యశాలల పరిధిలో శనివారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 55 కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు వేసినట్లు మండల ఇన్‌చార్జి పశు వైద్యాధికారి ఎస్‌వీఎస్ రాఘవేంద్రశర్మ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న రేబిస్ నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.

మర్రిపాడు పశు వైద్యశాలలో..

సంగం: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం సంగం మండలంలోని మర్రిపాడు పశు వైద్యశాలలో పశు వైద్యాధికారి సుజని పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు వేశారు.

అల్లూరులో..

అల్లూరు: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం అల్లూరులోని పశువైద్యశాలలో కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యుడు ఎ.మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. జంతువులు పెంచుకోవడానికి ఎంత మురిపెంగా ఉంటాయో వాటి ఆరోగ్యం, పరిశుభ్రతల గురించి సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధుల బారిన పడే ముప్పు ఉందన్నారు. 124 కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు గౌతమ్, ప్రియాంక, పెంపుడు కుక్కల యజమానులు పాల్గొన్నారు.

చేజర్ల పశు వైద్యశాలలో..

చేజర్ల: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం చేజర్లలోని పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి పి.రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు ప్రతి సంవత్సరం విధిగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



అల్లూరు: మండలంలోని పురిణి పంచాయతీ నలచెరువుకట్ట గిరిజనకాలనీలో ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పొట్లూరి వెంకయ్య గుడిసె దగ్ధమైన నేపథ్యంలో ఆ కుటుంబానికి శనివారం ఐటీడీపీ ప్రతినిధులు 2 నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాతీయ గిరిజన ఫెడరేషన్ జిల్లా చైర్మన్ దాసరి పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అల్లూరు: మండల పరిధిలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అల్లూరు టౌన్ ఏఈ షేక్ మస్తాన్ శనివారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతా

అల్లూరు: మండలంలోని ఇస్కపల్లి జెడ్పీ హైస్కూల్‌ను ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తెలిపారు. శనివారం ఇస్కపల్లి జెడ్పీ హైస్కూల్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓలు రవీంద్రనాథ్, సునీత, నాయకులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకం కోసం దరఖాస్తులు

సీతారామపురం: పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ సుభాషిణి సూచించారు. ఆమె శనివారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీతారామపురం మండలంలో 200 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటి వరకు 23 ఎకరాలకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా నూరు శాతం సబ్సిడీతో ప్రభుత్వం అమలు చేసే ఈ పథకాన్ని మండలంలోని అన్ని పంచాయతీలకు చెందిన సన్న, చిన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మల్టీపర్పస్ కింద ఒక రైతు తన పొలంలో నాలుగు రకాల పండ్ల మొక్కలను 100 చొప్పున వేసుకునే వెసులుబాటు ఉందన్నారు. ఆసక్తి గల రైతులు 1-బి, అడంగల్, పట్టాదారు పాసుపుస్తకం, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డుతో తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట ఈసీ సువర్తయ్య, టీఏలు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏపీఓ సుభాషిణి

బాబూ జగ్జీవన్‌రాం సేవలు చిరస్మరణీయం



సీతారామపురం: బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

సీతారామపురం: స్వాతంత్ర్య సమరయోధుడు బాబూ జగ్జీవన్‌రాం సేవలు చిరస్మరణీయమని దళిత నాయకులు పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ భార్గవిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బాలస్వామి, నాయకులు బొగ్గవరపు రత్నం, తిరుపాలు, ఇజ్రాయిల్, రాజేష్, కొండయ్య, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.



జలదంకి: తహసీల్దార్ కార్యాలయంలో..

బడుగుల ఆశాజ్యోతి

జలదంకి: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని తహసీల్దార్ వాసు కొనియాడారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు చెన్నకృష్ణయ్య, శివ, బాలకోటయ్య, శివకుమార్, మాలకొండయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సహకార వ్యవస్థతో రైతులకు మేలు



ఆత్మకూరురూరల్: మాట్లాడుతున్న వెన్నవాడ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి మల్లికార్జున



ఆత్మకూరు: ర్యాలీ నిర్వహిస్తున్న వెలుగు సిబ్బంది

ఆత్మకూరురూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వెన్నవాడ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి ఎన్.మల్లికార్జున పేర్కొన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వెన్నవాడ సొసైటీ కార్యాలయంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులకు వ్యవసాయ రుణాల పంపిణీతోపాటు ప్రభుత్వం ద్వారా అందే అనేక ప్రోత్సాహకాలను సహకార సంఘం ద్వారా అందిస్తున్నామని తెలిపారు. ఎరువులు, పురుగుమందులు అందజేయడంతోపాటు వాటి వినియోగంపై రైతులకు సూచనలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సురేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

రాజవోలులో సహకార దినోత్సవం

అనుమసముద్రంపేట: మండలంలోని రాజవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పర్సన్ ఇన్‌చార్జి బి.సత్యనారాయణ, ఏఎస్‌పేట ఎన్‌డీసీసీ బ్రాంచ్ మేనేజర్ సీహెచ్‌వీ సుబ్బారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ వి.హరీష్, రాజవోలు పీఏసీఎస్ సీఈఓ ఎస్.రమేష్‌రెడ్డి, మహేంద్ర, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయంలో..

ఆత్మకూరు: పట్టణంలోని క్రాంతిపథం (వెలుగు) కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహించారు. వెలుగు ఏపీఎం జి.వెంకమ్మ మాట్లాడుతూ సహకారశాఖ ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలకు, పట్టణంలో పలు వ్యాపారాల నిర్వహణకు సులభతరంగా రుణాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం వెలుగు సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ ఎండీ మున్వర్, ఫీల్డ్ ఆఫీసర్ షేక్ షబ్బీర్, వెలుగు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు

వరికుంటపాడు: మండలంలో 104 వాహనం ద్వారా అందించే ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారిణి ఆయేషా సూచించారు. ఆమె శనివారం మండలంలోని తోటలచెరువుపల్లెలో నిర్వహించిన వైద్యశిబిరం 60 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందుతున్నాయని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ హైమా, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంఈఓ-2 ప్రభాకర్‌రెడ్డి

సోమశిల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఉపాధ్యాయులు ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఎంఈఓ-2 ప్రభాకర్‌రెడ్డి సూచించారు. అనంతసాగరం మండలంలోని కామిరెడ్డిపాడు, చిలకలమర్రి, బొమ్మవరం అగ్రహారం, వడ్డిపాళెం, గుడిగుంట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓ-2 ప్రభాకర్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు.

పోస్టల్ నగదు స్వాహాపై విచారణ

ఉదయగిరి: మండలంలోని పుల్లాయపల్లి బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ షేక్ నాయబ్‌రసూల్ ఇటీవల ఖాతాదారుల పొదుపు సొమ్మును స్వాహా చేసి పరారీలో ఉన్న నేపథ్యంలో శనివారం ఎంపీడీఓ ఈశ్వరమ్మ ఆ గ్రామంలో విచారణ చేపట్టారు. ముందుగా తపాలా కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఖాతాదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అలాగే పొదుపు ఖాతా పుస్తకాలను పరిశీలించారు. తదుపరి ఆమె మాట్లాడుతూ ఖాతాదారులు తెలిపిన విషయాలతోపాటు విచారణలో తాను తెలుసుకున్న అంశాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఆమె వెంట మండల విస్తరణాధికారి మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి కరిముల్లా ఉన్నారు.



ఖాతాదారులను విచారిస్తున్న ఎంపీడీఓ ఈశ్వరమ్మ

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

- మహిళకు తీవ్రగాయాలు

సీతారామపురం: మండలంలోని రంగనాయుడుపల్లి గ్రామ సమీపంలో శనివారం ప్రయాణికులతో వెళ్తున్న ఓ ఆటోను ట్రాక్టర్ ఢీకొంది. ఈ ఘటనలో కుర్రపల్లి బీసీకాలనీకి చెందిన గండికోట వెంకటమ్మ అనే మహిళకు రెండు కాళ్లు విరిగిపోయాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సీతారామపురం నుంచి ఉదయగిరికి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో మార్గమధ్యంలో రంగనాయుడుపల్లి గ్రామ సమీపానికి వచ్చేసరికి రోడ్డుపై పాము అడ్డుగా రావడంతో డ్రైవర్ ఆటోను స్లో చేశాడు. వెనుకనే వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఆటో వెనుక వైపున కూర్చున్న వెంకటమ్మకు రెండు కాళ్లు విరిగిపోయాయి. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెంకటమ్మకు చికిత్స చేస్తున్న 108 సిబ్బంది